క్లుప్తంగా

ఏఓకు వినతి..



వినతిపత్రం సమర్పిస్తున్న సంఘ బాధ్యులు

ఖమ్మం వైద్యవిభాగం: వైద్యారోగ్యశాఖ ఉద్యోగులకు ఫేస్ ఆధారిత అటెండెన్స్ విధానాన్ని ఎత్తివేయాలని కోరుతూ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఏఓకు వైద్యారోగ్య శాఖ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, హెచ్–1, టీఆర్‌ఎస్‌కేవీ తదితర సంఘాల బాధ్యులు వేణుగోపాల్, వెంకటరమణ, సూర్యం, కృష్ణారావు, సందీప్, ధనలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ల ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

మాయావతి తీరుకు ఖండన

కూసుమంచి: ఎస్సీ వర్గీకరణపై హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ భరోసా సభలో పాల్గొన్న పార్టీ అధినేత్రి మాయావతి స్పందించకపోవడం దారుణమని మహాజన సోషలిస్ట్ పార్టీ పాలేరు ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు మాదిగ అన్నారు. సోమవారం కూసుమంచిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయ సిద్ధాంతానికి బీఎస్పీ దూరమని సభ ద్వారా తేటతెల్లమైందని, మాయావతి విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు తోళ్ల సురేష్, కుక్కల రవీంద్రబాబు, చంద్రం, వెంకట్రావు, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్, హెన్రీడునాట్ జయంతి దినోత్సవాన్ని సోమవారం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ చంద్రమోహన్, కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బాధ్యులు, కళాశాల బాధ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్ గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు. కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా వంగూరి రవి, మోరు నాగేశ్వరరావు, కార్యదర్శిగా పొన్నెకంటి ఉప్పలయ్య, కోశాధికారిగా డి.రాము, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మనేడి రవిరాజు, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా కొత్త హరీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి, ఎరసాని శివశంకర్‌రెడ్డిలకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశ్రీ కళావేదిక జిల్లా కమిటీ ఏర్పాటు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీశ్రీ సాహితీ సంస్థ విజయవాడలో నిర్వహించిన ప్లీనరీలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం జిల్లా కమిటీని నియమించి ప్రతినిధులకు నియామకపు పత్రాలను అందించింది. సంస్థ అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కమిటీలో అధ్యక్షుడిగా అయితగాని జనార్ధన్, ఉపాధ్యక్షుడిగా కట్టెకోల చిన్న నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా సిద్దగాని భాగ్య, గౌరవ అధ్యక్షుడిగా మువ్వా శ్రీనివాసరావు నియమితులు కాగా యువజన విభాగంలో జిల్లా అధ్యక్షులుగా వినీల, ప్రధాన కార్యదర్శిగా ఆనం అశ్రితారెడ్డిలు నియమితులయ్యారు.

తాగునీటి సమస్యలు రానీయొద్దు..

ఖమ్మంఅర్బన్: గ్రామాల్లో తాగు నీటి సరఫరాలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించి తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ శ్రీనివాస్ సంబంధిత ఇంజనీర్లకు సూచించారు. సోమవారం ఖమ్మం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కార్యాలయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎస్‌ఈలు, డీఈలు, ఏఈలతో సమీక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పైపు లైన్ల లీకేజ్, నీరు కలుషితం కాకుండా చూడాలని, ప్రతి ఇంటికినల్లా నీరు అందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సదాశివం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	పీఎస్–2
వినోద	విరూపాక్ష
సాయిరాం	రామబాణం
ఆదిత్య	ఉగ్రం
శ్రీనివాస	ఏజెంట్
సుందర్	విద్యార్థి

– ఖమ్మంగాంధీచౌక్

నెలాఖరు కల్లా దరఖాస్తు చేసుకోండి

ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంఅర్బన్: నగరంలోని అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 2, 3, 4, 8, 9వ డివిజన్‌లో మొత్తం 167 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 58, 59 జీఓ ప్రకారం ఇళ్ల పట్టాల కోసం గతంలో దరఖాస్తు చేసుకోవడానికి ఉన్న గడువు ముగిసినా సీఎం కేసీఆర్ 2020 ఏడాది లోపు పట్టాలు కలిగిన వారు ఈ నెలాఖరు కల్లా మరోమారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. సొంత స్థలం కలిగిన వారికి రూ.3లక్షలు ప్రభుత్వం తరఫున అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, ఆర్డీఓ రవీంద్రనాథ్, తహసీల్దార్ శైలజ, కార్పొరేటర్లు జాన్‌బీ, దండా జ్యోతిరెడ్డి, నాయకులు ఇస్సాక్, భూక్యా బాషా, నాగుల్ మీరా, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం..

ఖమ్మంమయూరిసెంటర్: రావర్తి నగర్‌లోని షైన్ ఇండియా పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మంత్రి అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సదర్భంగా మంత్రి, కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందని, ఇంటింటికి వెళ్లి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావర్తి శరత్‌కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్ బి.మాలతి, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ..

నగరంలోని 46వ డివిజన్‌లో సత్యమార్గం సర్వీసెస్ సొసైటీ ద్వారా స్వయం ఉపాధి టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు ఆర్‌జేసీ కృష్ణ ఆధ్వర్యంలో ఉచితంగా అందించిన కుట్టు మిషన్లను మంత్రి అజయ్‌కుమార్ చేతుల మీదుగా 64 మంది మహిళలకు అందించారు. కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, రుద్రగాని ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ పాలకవర్గానికి శుభాకాంక్షలు..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మేయర్ పునుకొల్లు నీరజను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సన్మానించారు. సోమవారం వీడీవోస్ కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు మంత్రి పువ్వాడను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మేయర్‌ను సన్మానించి, పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు..

కామేపల్లి(కారేపల్లి): మండలంలోని ఎనిమిది గ్రామాల్లో మంజూరైన ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, డీఎంఎఫ్‌టీ, సీడీపీ, జీపీ ఎస్‌డీపీ నిధులు రూ.40 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి అజయ్‌కుమార్, ఎమ్మెల్యే హరిప్రియ శంకుస్థాపనలు చేసి పలు పనులను ప్రారంభోత్సవాలు చేశారు. కాగా, మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల హనుమంతరావు ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మోటార్ సైకిళ్లతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆర్డీఓ రవీంద్రనాథ్, ఎంపీపీ బానోత్ సునీత, తహసీల్దార్ కోట రవికుమార్, ఎంపీడీఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచులు, పీఆర్, ఆర్‌అండ్‌బీ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు..



మంత్రితో కాంట్రాక్ట్ అధ్యాపకులు, ఆర్‌జేసీ కృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నాయకులు మంత్రి అజయ్‌కుమార్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కుప్పిశెట్టి సురేష్, కొండా వినోద్‌బాబు, మురళీకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, కాంట్రాక్ట్ అధ్యాపకులు శ్రీకాంత్, భిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి ఘన సన్మానం..



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, ఆలయ సిబ్బంది

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కోటమైసమ్మతల్లిని మంత్రి అజయ్‌కుమార్, ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సోమవారం దర్శించుకున్నారు. దీంతో మంత్రికి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఆలయ చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మల్లెంపాటి నర్సింహారావు, ఆలయ సిబ్బంది శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రికి ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

కరెంట్, నీళ్లు, ఇప్పించాలని ధర్నా..

ఖమ్మంఅర్బన్: నగరంలోని వెలుగుమట్ల గుట్టపై వినోబా నవోదయ కాలనీలో నివాసం ఉంటున్న వందలాది మంది నిరుపేదలు తమకు కరెంట్, తాగు నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన చేసి ధర్నా చేశారు. భూదాన భూమిలో చాలా ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, హైకోర్టు నుంచి సైతం మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉత్తర్వులు జారీ చేసినప్పటి నుంచి దఫాలుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం ఉండడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. కటిక చీకటిలో తామే తాత్కాలికంగా లైట్లు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామని, నీరు, కరెంట్, రోడ్ల సౌకర్యం కల్పించాలని ఖాళీ బిందెలతో ప్లకార్డులతో నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించాక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి వినతి పత్రం అందించారు. గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నాలో గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడిగ యర్రయ్య, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దండా లింగయ్య, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పోలెబోయిన ముత్తయ్య, గ్రామీణ పేదల సంఘం ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్తి రామచంద్రయ్య, సహాయ కార్యదర్శి తాళ్లూరి కృష్ణ, గ్రామీణ పేదల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సొందు మియా, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ జిల్లా సహాయ కార్యదర్శి చిప్పలపల్లి వీరన్నతో పాటు వరాగాని కోటేశ్వరరావు, కొప్పెర వెంకన్న, జంగం రాంచందర్, బోల్లు వెంకటేశ్వర్లు, మంకిడి లింగరాజు, ముడిగ రాములు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాలనీవాసులు

సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఖమ్మం సహకారనగర్/నేలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో సోమవారం జరిగిన యువ సంఘర్షణ సభకు పలు మండలాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఖమ్మంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ జెండా ఊపి ప్రారంభించగా.. మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నాయకులు మహ్మద్ జావీద్, రాయల నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం నుంచి టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా యువత, నిరుద్యోగులు, పార్టీ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, యడవల్లి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, బోయిన వేణు, యాతాకుల శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి నుంచి తరలివెళ్తున్న నాయకులు

చెస్ శిక్షణా శిబిరం ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో సోమవారం నుంచి వేసవి శిక్షణా శిబిరం ప్రారంభమైంది. ఈ శిక్షణా శిబిరాన్ని డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. కాగా, చెస్ శిక్షణ శిబిరానికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఔత్సాహిక క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చెస్ అర్బిటర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

మన్యం వీరుడు 'అల్లూరి'

కూసుమంచి: మన్యం వీరుడు, విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమించాలని న్యూడెమోక్రసీ పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పాలేరులో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు వర్ధంతి, మేడే వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్రెపాటి రమేష్, ఐ.వెంకన్న, చెరకుపల్లి వీరయ్య, రామయ్య, కోటిరెడ్డి, నరేష్, వెంకన్న పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక శాఖ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాహాన్ డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మంలో నిర్వహించిన ఐఎఫ్‌టీయూ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ ఇన్సూరెన్స్ కట్టిన కార్మికులకు మరణ ఆర్థిక సాయం, ప్రసూతి సాయం, వివాహ కానుకలు ఆలస్యం అవుతుండడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కారం చేయలేనిపక్షంలో దశలవారి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు గోగులోత్ పటేల్, బోడ నాగేశ్వరరావు, గొని మోహన్ రావు, సందీప్, ఉపేందర్, మల్లేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు సౌకర్యాలు కల్పించండి

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జాన్‌బాద్‌తండాలో జరుగుతున్న ఉపాధి పనులను జిల్లా కమిటీ సభ్యుడు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాపనేని వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రోజు కూలి రూ.600 ఇవ్వడంతో పాటు 200 రోజులు పని దినాలు కల్పించాలని, పని ప్రదేశంలో టెంట్, తాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు పార, గడ్డపలుగు వంటి పనిముట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



కూలీలతో మాట్లాడుతున్న సంగయ్య, వెంకటేశ్వర్లు

పల్లె పాలనకు సమ్మె పోటు..!

- ఇప్పటికే ఆందోళన బాటలో జేపీఎస్‌లు
- త్వరలో పారిశుద్ధ్య కార్మికులు సమ్మె బాట

నేలకొండపల్లి: గత 11 రోజులుగా విధులు బహిష్కరించి తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు కూడా ఈ నెలలోనే సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. జేపీఎస్‌లు విధులు బహిష్కరణతో గ్రామాల్లో ఇప్పటికే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. పారిశుద్ధ్య కార్మికులు కూడా అదే దారిలో వెళ్తే పరిస్థితి అధ్వానంగా మారనుంది.

సమ్మె ప్రభావం..

ప్రస్తుతం పాలేరు నియోజకవర్గంలో బాధ్యతలు అప్పగించిన అధికారులకు వారి కార్యాలయాల్లో విధులు నిర్వహించటం, ఇన్‌చార్జ్ బాధ్యతలు కేటాయించిన పంచాయతీలు తిరగటం చాలా ఇబ్బందికరంగా మారింది. ఇటు కార్యాలయ పనులే కాక పంచాయతీ పనులు ముందుకు సాగక ఇక్కట్లు పడుతున్నారు. పంచాయతీ కార్యాలయాలు తెరుచుకోక వివిధ అనుమతులు, మంచినీటి క్లోరినేషన్, ఉపాధి హామీ పథకం మస్టర్లు, వేలిముద్రలు, నర్సరీ నిర్వహణ ఇతరత్రా పనులు మందగించాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికుల కూడా విధులు బహిష్కరిస్తే.. పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా కానుంది. చెత్త సేకరణ, మురుగు కాల్వల పూడికతీత తదితర పనులు నిలిచిపోనున్నాయి.



నేలకొండపల్లిలో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు (ఫైల్)

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం..



జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. రెగ్యులర్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలను అప్పగించాం. ప్రజలకు సాధ్యమైనంత వరకు ఇబ్బందులు రాకుండా చూస్తాం.

– కె.జమలారెడ్డి, ఎంపీడీఓ, నేలకొండపల్లి

పాలేరు నియోజకవర్గంలో 112 మంది సమ్మె బాట..

గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శులు పాలేరు నియోజకవర్గంలో మొత్తం 112 మంది సమ్మెలో ఉన్నారు. నేలకొండపల్లి మండలంలోని జేపీఎస్‌లు–21 మంది, ఏపీఎస్–2, తిరుమలాయపాలెం మండలంలోని 32 మంది జేపీఎస్‌లు, ఓపీఎస్–1, కూసుమంచి మండలంలో జేపీఎస్‌లు– 34 మంది, ఖమ్మం రూరల్ మండలంలోని జేపీఎస్‌లు–19, ఓపీఎస్‌లు– ఇద్దరు సమ్మెలో ఉన్నారు. కాగా, మండల పరిషత్‌లో పని చేసే సూపరింటిండెంట్, సీనియర్ అసిస్టెంట్లు, ఇతరత్రా సిబ్బందిని నియమించి ఒక్కొక్కరికి మూడు లేదా నాలుగు పంచాయతీలు చొప్పున బాధ్యతలు అప్పగించారు.

అక్రిడిటేషన్ల సమస్యను పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: అక్రిడిటేషన్ల సమస్యను పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవిలు కోరారు. సోమవారం జిల్లాలో మూడో విడత అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అక్రిడిటేషన్ కార్డులు అందరికీ మంజూరు చేయాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వల్లోజి శ్రీనివాసరావుకు అడిషనల్ పీఆర్వోగా పదోన్నతి పొందడంతో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాంబశివరావు, బొల్లం శ్రీనివాస్, టెంజు జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) నాయకులు

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



బాధితులతో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్/ రఘునాథపాలెం: ఖమ్మం నగరంలోని 16వ డివిజన్ బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, శిక్షణ కలెక్టర్ రాధిక గుప్తా, కార్పొరేటర్ మేడారపు వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ రాంబాబు, మెడికల్ ఆఫీసర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు. అలాగే రఘునాథపాలెం పంచాయతీలోని పల్లె దవాఖానాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ గుడిపుడి శారదరామారావు, ఎంపీటీసీ మద్దినేని రజనివెంకటరమణ, ఎంపీడీఓ రామకృష్ణలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ, ఉప సర్పంచ్ కుందే సాబ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, బిల్ కలెక్టర్ అంజయ్య పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్ కల్పించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీలకు జనాబా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర నాయకులు నరేందర్‌గౌడ్, జగదీష్, వినయ్‌బాబు, భిక్షపతి, మహేష్,వెంకటేశ్వర్లు,పిచ్చయ్య పాల్గొన్నారు.

సబ్సిడీ యూనిట్లు పెంచాలని ఆందోళన

తిరుమలాయపాలెం: ముస్లిం, మైనార్టీలకు ప్రభుత్వం సబ్సిడీ యూనిట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ముస్లింలు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ.. ముస్లిం జనాభా పరంగా యూనిట్లు పెంచి ముస్లింలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీఓ జయరాంకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మదార్ సాహెబ్, మహబూబ్, మైసూర్, షేక్ జాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ముస్లింలు

ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం వత్తాసు



సమావేశంలో మాట్లాడుతున్న ఆజాద్

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తోందని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి నామాల ఆజాద్ విమర్శించారు. సోమవారం నగరంలో నిర్వహించిన పీడీఎస్‌యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా ముందస్తుగా అడ్మిషన్లు జరుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదన్నారు. ప్రైవేట్ ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. అనుమతి లేని ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలపై ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు శ్రీకాంత్, నరేందర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేతను కలిసిన వర్తక సంఘం ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావును సోమవారం ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ఉపాధ్యక్షుడు సోమ నర్సింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణ, కోశాధికారి తల్లాడ రమేష్, దాల్‌మిల్ శాఖ అధ్యక్షులు వేములపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నగర ప్రజల నుంచి కమిషనర్ ఆదర్శ్ సురభి ఫిర్యాదులను స్వీకరించారు.సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 38 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని పరిశీలించి, త్వరగా పరిష్కరించాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించిన కమిషనర్ మాట్లాడుతూ పంపు పన్నులపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఐదో రోజుకు చేరిన ఎమ్మార్పీఎస్ దీక్ష

ఖమ్మం మామిళ్లగూడెం: దళిత బంధు అక్రమాలకు పాల్పడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన ధర్నా చౌక్‌లో చేపట్టిన దీక్ష ఆదివారం ఐదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోని పక్షాన 10న కలెక్టరేట్ ముట్టడి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజయ్య, రాము, జనార్దన్, శ్రీను, సైదులు, రమ, మంగమ్మ, భూలక్ష్మి, నాగేశ్వరావు, సీతారాములు, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రికి లెక్చరర్ల సంఘం లేఖ

ఖమ్మం సహకారనగర్: ప్రైవేట్ లెక్చరర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డికి లేఖ రాసినట్లు తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు పర్సా రమేష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్‌లో కేజీ నుంచి పీజీ విద్యాసంస్థల్లో పని చేస్తున్న ప్రతి ఉద్యోగికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంస్కృతం డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఇంటర్మీడియట్ జవాబు పత్రాల వాల్యూయేషన్ పూర్తయి రిజల్ట్స్ ఇచ్చే సమయం వచ్చినా రెమ్యునరేషన్ ఇవ్వలేదని, వెంటనే రెమ్యునరేషన్ జమ చేయాలన్నారు.